# ప్రాణాలైనా ఇస్తాం.. భూమిని వదులుకోం

- దళితులమని దబాయిస్తుండ్రు..
- మా తాత ముత్తాతల కాలం నుంచి కాస్తులో ఉన్నాం
- మాజీ ఎమ్మెల్యే ఇచ్చిందని మెడికల్ అసోసియేషన్ వాళ్ళ బెదిరింపు
- మాకు అండగా మా ఎమ్మెల్యే ఉన్నారు



**మెదక్ ప్రతినిధి, నవంబర్14(సిరి న్యూస్ )**దళితులమని దభాయిస్తుండ్రు...మా తాత ముత్తాతల కాలం నుంచి కాస్తులో ఉన్నాం.. మక్కలు, తైదలు కూడా పండించాం.ఎవరో మెడికల్ అసోసియేషన్ వాళ్ళు అంట. మాకు ఎమ్మెల్యేగా పద్మా దేవేందర్ రెడ్డి ఉన్నప్పుడు ఇచ్చింది. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ బెదిరిస్తున్నారని దళితులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు సంఘటన స్థలానికి వచ్చి టెంటు వేసుకొని మీటింగ్ పెట్టేందుకు ప్రయత్నించిగా రైతులు అడ్డుకుని వాళ్ళ వద్ద ఉన్న డాక్యుమెంట్లతో నిరసన తెలిపారు. హవేలి ఘనపూర్ మండలం ఔరంగ బాద్ శివారులోని ఆవుసుల పల్లి ప్రాంతంలో సర్వే నెంబర్ 77 లో రాపోలు పోచయ్య పేరుమీద 35 గుంటల భూమి ఉండేది. ఆ భూమికి పాస్ బుక్ సైతం ఉంది. ఆ భూమిని పలువురు దళితులు ఏండ్ల తరబడి సాగుచేసుకొని మొక్క జొన్న, తైదలు పండించేవారు.కాలక్రమేణా చుట్టూ పక్కల ఇళ్ళు కూడా వెలిశాయి. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 77సర్వే నంబర్ పక్కన బిఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి నిర్మించారు. తాము దళితులమని, ఏమి చేయలేమని మా సర్వే నంబర్ లోనే బ్రాహ్మణులకు కుల సంఘ భవనానికి అప్పట్లో స్థలం కేటాయించారు. ఇప్పుడు మళ్ళీ మెడికల్ అసోసియేషన్ వాళ్ళు వచ్చి ఈ భూమిని మాకు కేటాయించారని బెదిరిస్తున్నారని దళిత రైతులు ఆరోపిస్తున్నారు.

### మాకు ఎమ్మెల్యే ఉన్నారు..

దళితులమైన మాకు ఎమ్మెల్యే రోహిత్ రావ్ ఉన్నారు. మా జోలికొస్తే మా ఎమ్మెల్యే దగ్గరకు పోయి, మీరు మాపై చేస్తున్న అరాచకాలను వివరిస్తాం. మేమంతా ఎమ్మెల్యే గెలుపు కోసం పనిచేసినవాళ్ళము.బిఆర్ఎస్ లీడర్లకు దళితుల భూములు ఆక్రమించడం అలవాటుగా మారింది. అప్పటి ఎమ్మెల్యే కాగితం పట్టుకొని మమల్ని బెదిరిస్తే చూస్తూ ఊరుకోం. ప్రాణాలైనా అర్పిస్తాం. కానీ ఒక్క గజం భూమి కూడా వదులుకోము అని దళిత రైతులు హెచ్చరిస్తున్నారు. 58,59 జీవో ల కింద పంచాయితీకి దరఖాస్తులు కూడా చేసుకున్నాం. పంచాయితీకి పన్నులు కూడా చెల్లించామని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా బాధను ఎమ్మెల్యే కు చెపుతామంటే తహసీల్దార్ కూడా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ తమను బెదిరిస్తుందని, ఆ జాగాలో నుంచి మీరు ఖాళీ చేయాలని తహసీల్దార్ చెబుతున్నారని రైతులు మీడియా తో వాపోయారు.డాక్యుమెంట్లతో నిరసన తెలిపిన వారిలో రాపోల్ సిద్దయ్య,కుంటి ఇస్తరి, కొణింటి రాజయ్య,బాగారి స్వామి,శ్రీశైలం పట్లోళ్ల,రాజలింగం,కిష్టయ్య తదితరులు ఉన్నారు.

# ఏసీబీ దాడులు

## జహీరాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

- రూ. 42,300 నగదు సీజ్
- పంపిణీ కానీ 113 డాక్యుమెంట్లు స్వాధీనం
- ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్ ఇంట్లో సోదాలు
- ఏసీబీ అధికారి సుదర్శన్ వెల్లడి




**జహీరాబాద్, నవంబరు 14(సిరి న్యూస్ ) :** జహీరాబాద్ లోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు కూడా అధికారులు కార్యాలయంలో ఉండి పలు రికార్డులను పరిశీలించారు. ఏసీబీ అధికారులు దాడి చేస్తున్న సమాచారం మేరకు డాక్యుమెంట్ రైటర్స్ తమ దుకాణాలను మూసేసుకొని వెళ్ళిపోయారు. ఏసీబీ అధికారులు కార్యాలయానికి వెళ్లిన తర్వాత తలుపులు వేసుకొని లోపలి వారిని బయటికి రానివ్వకుండా చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనంతరం రాత్రి 10 గంటలకు ఏసీబీ అధికారి సుదర్శన్ మీడియాతో మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తాము ఆకస్మిక తనిఖీలు చేపట్టామని, ఈ సమయంలో పది మంది ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులను ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ పరంజ్యోతి వారికి సహకరిస్తున్నారని, వీరి నుండి 42,300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే సుమారు 113 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులకు ఇవ్వలేదని, వాటి పైన కూడా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ ఇంట్లో కూడా సోదాలు జరుపుతున్నట్లు పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.




# సీఎం రేవంత్ నాయకత్వాన్ని ప్రజలు స్వాగతించారు

- బీసీ బిడ్డ నవీన్ యాదవ్ ను గెలిపించిన జుబ్లీహిల్స్ ప్రజలకు ధన్యవాదాలు
- నీలం మధు ముదిరాజ్
- ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్
- మంత్రులతో కలసి సంబరాలు

**పటాన్ చెరు, నవంబర్,14, (సిరి న్యూస్) :**ఇందిరమ్మ తరహాలో ప్రజా పాలన అందిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు స్వాగతించి, జూబ్లీహిల్స్ లో భారీ మెజార్టీ తో కాంగ్రెస్ ను గెలిపించారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీ తో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన సందర్భంగా జుబ్లీహిల్స్ లోని సీఎం పార్టీ ఆఫీసులో జరిగిన మీడియా సమావేశంలో నీలం మధు పాల్గొన్నారు, అలాగే మంత్రులతో కలసి సంబరాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బిడ్డకి టికెట్ ఇచ్చి బీసీ వాదాన్ని బలపర్చిన ముఖ్యమంత్రి రేవంత్ నమ్మకాన్ని ప్రజలు నిలబెట్టారని సంతోషం వ్యక్తంచేశారు. యావత్ బీసీ లోకమంతా కాంగ్రెస్ పార్టీ కి మద్దతు ఇచ్చి గెలుపు లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బీసీ బిడ్డ నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీ తో గెలిపించిన జూబ్లిహిల్స్ ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

